కలెక్టరేట్‌కు సొబగులు

- ఉత్తర, దక్షిణ భాగాలు విభజించి ఆధునీకరణ పనులు
- సీఎం, ఆర్థికమంత్రులకు కలెక్టరేట్ దుస్థితిని వివరించి నిధులు రాబట్టిన కలెక్టర్
- రూ.8.08 కోట్లతో ఎస్టిమేషన్, టెండర్ల ఆహ్వానం


మంత్రి బుగ్గనతో కలసి కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ చేస్తున్న కృషి ఫలిస్తోంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవన సముదాయం పెచ్చులూడుతోంది. ఇక ఎక్కడ చూసిన చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన కలెక్టరేట్ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కలెక్టరేట్ దుస్థితిని సీఎం వైఎస్ జగన్, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి రూ.8.08 కోట్లను మంజూరు చేయించారు.

ముందుగా స్వచ్ఛ కార్యాలయాలకు పిలుపు

డాక్టర్ జి.సృజన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాలను సందర్శించి దుస్థితిని తెలుసుకున్నారు. ఏ కార్యాలయంలో చూసినా చెత్తా చెదారం నిండి ఉండడంతో శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర అంటూ అధికారులే ప్రజలకు పరిశుభ్రతపై చెబుతున్న సమయంలో కార్యాలయాలు శుభ్రంగా ఉండకపోతే ఎలా అని కలెక్టర్ ప్రశ్నించారు. కార్యాలయాలు శుభ్రంగా లేకపోతే జరిమానా విధించాలని మునిసిపల్ కమిషనర్‌ను సైతం ఆదేశించడంతో ఆయా కార్యాలయాల అధికారులు తమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి చర్యలు చేపట్టారు. అదే సమయంలో ఆధునికీకరణకు నిధులు ఇస్తామని, ఎస్టిమేషన్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో కలెక్టరేట్‌లోని 31 శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, పెయింటింగ్, ఇతర పనుల కోసం నివేదించారు.

ఆర్థిక మంత్రి దృష్టికి..

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆహ్వానించి కలెక్టరేట్‌లోని వివిధ భవనాల దుస్థితిని కలెక్టర్ దగ్గరుండి చూపించారు. పలు కార్యాలయాలు కుప్పకూలిపోయే ప్రమాదముందని మంత్రికి వివరించారు. డీఈఓ కార్యాలయం, ఎస్ఆర్‌బీసీ తదితర కార్యాలయాల పరిస్థితి దయనీయంగా ఉండటంతో భవనాల పునర్నిర్మాణానికి ఎస్టిమేషన్లను పంపితే నిధులు మంజూరు చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి హామీ ఇస్తూ కలెక్టరేట్ ముందు భాగం, సునయన ఆడిటోరియాలను అందంగా తీర్చిదిద్దాలని ఆయన సూచన చేశారు.

ప్రాధాన్యత క్రమంలో ఆధునీకరణ పనులు

కలెక్టరేట్ భవనాన్ని ప్రాధాన్యత క్రమంలో ఆధునీకరించేందుకు గతంలో పనిచేసిన కలెక్టర్లు కూడా చర్యలు తీసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు, మినీ కాన్ఫరెన్స్ హాలు, హౌసింగ్ పీడీ, కార్యాలయం, సీపీఓ, డీఆర్వో, ఏఓ కార్యాలయాలను ఆధునీకరించారు. కలెక్టర్‌గా డాక్టర్ సృజన వచ్చిన తరువాత కలెక్టర్ చాంబరు, కాన్ఫరెన్స్‌హాళ్ల ఆధునీకరణ జరుగుతోంది. గతంలోనే జేసీ కార్యాలయాన్ని ఆధునీకరించారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మిగిలిన కార్యాలయాలను ఆధునీకరించేందుకుకలెక్టర్‌చర్యలు తీసుకుంటున్నారు.

అర్కిటెక్‌తో ప్రణాళిక..

కలెక్టరేట్ పునర్నిర్మాణంలో భాగంగా అర్కిటెక్ వేణుగోపాల్‌తో కలెక్టర్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. కలెక్టరేట్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి పునర్నిర్మించేలా ప్రణాళికను రూపొందించారు. మొదట అన్ని కార్యాలయాల్లో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పెయింటింగ్‌ను తక్షణమే వేయించాలని సూచించారు. గాలి, వెలుతురు వచ్చేలా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, 24 గంటలు కరెంట్ ఉండాలని, మాస్టర్ ప్లాన్ రూపొందించారు. సునయన ఆడిటోరియం, కలెక్టరేట్ ముందు భాగం అందంగా కనిపించేలా వివిధ డిజైన్లను ఎంపిక చేశారు.

టెండర్లు పిలిచిన ఆర్‌అండ్‌బీ..

కలెక్టరేట్ ఆధునికీకరణ పనులకు సంబంధించిన టెండర్లను ఆర్‌అండ్‌బీ పిలిచింది. మొత్తం 8.08 కోట్లకు సంబంధించి ఈనెల 28వ తేదీ వరకు టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

నిధులు దేనికెంత

కలెక్టరేట్ ఉత్తర భాగానికి	రూ.45 లక్షలు
దక్షణ భాగానికి	రూ.23 లక్షలు
మరుగుదొడ్లకు	రూ.45 లక్షలు
సునయన ఆడిటోరియం	రూ.1.23 కోట్లు
కలెక్టరేట్ ముందు భాగం, దక్షిణ భాగం కార్యాలయాల ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, పెయింటింగ్, అంతర్గత మరమ్మతులు, వెంటిలేటర్లకు తక్షణం మరమ్మతుల కోసం	రూ.70 లక్షలు
ఉత్తర భాగం కార్యాలయాల రిపేర్లు, సన్‌షెడ్లు, పెయింటింగ్, బయటి గోడలకు సున్నం, పెయింటింగ్ తదితర పనులకు	రూ.50 లక్షలు
ఎస్ఆర్‌బీసీ బ్లాక్‌లో మరమ్మతులకు	రూ.77 లక్షలు
వివిధ కార్యాలయాల్లో ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, విండోల నిర్మాణానికి	రూ.1.85లక్షలు
ఈఓ కార్యాలయాల మరమ్మతులకు	రూ.1.90 కోట్లు

కలెక్టరేట్ ఆధునీకరణకు చర్యలు



కలెక్టరేట్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.8.08 కోట్లతో వివిధ పనులకు టెండర్లను పిలిచాం. అధికారులు బాధ్యతగా కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మర్మతులకు నిధుల మంజూరుకు సీఎం, ఆర్థికశాఖ మంత్రి అంగీకరించారు. త్వరలోనే పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్


కాన్ఫరెన్స్ హాలులో కొనసాగుతున్న ఆధునీకరణ పనులు


ఆధునీకరించిన మినీ కాన్ఫరెన్స్ హాలు

క్లుప్తంగా

రేపు రౌండ్ టేబుల్ సమావేశం


మాట్లాడుతున్న నేతలు

కర్నూలు(అర్బన్): ఈనెల 17న స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం సుభాష్ చంద్ర బోస్ తెలిపారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయాచారి, బత్తుల లక్ష్మికాంతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం అంశంపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా సామాజిక వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణోజీరావు, హేమంత్‌గౌడ్, చంద్రికమ్మ పాల్గొన్నారు.

వలంటీర్లపై విషం చిమ్మడం తగదు

కర్నూలు(రాజ్‌విహార్): సేవా గుణంతో పని చేసే వలంటీర్లపై విషం చిమ్మడం తగదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు 90 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలే అన్నారు. వీరు నిజాయితీగా పని చేస్తున్న వారి ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ మాట్లాడటం తగదన్నారు. ని, జన్మభూమి కమిటీ సభ్యుల మాదిరిగా టీడీపీ వర్గాలకు, మామూళ్లు ఇచ్చిన వాళ్లకు పథకాలు అందించడం లేదన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శిగా వెంకటరామరాజు



కర్నూలు(అర్బన్): లయన్స్ ఇంటర్నేషనల్ 316 జె కేబినెట్ కార్యదర్శిగా లయన్ ఎస్ వెంకటరామరాజును నియమించినట్లు జిల్లా గవర్నర్ లయన్ నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న కార్యక్రమాల్లో అనేక రకాల సేవలు అందిస్తున్న వెంకటరామరాజుకు ఈ బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. నూతన కేబినెట్ కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేస్తామన్నారు. అలాగే జిల్లాలో డయాలసిస్ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పర్యటనలతో జ్ఞానసముపార్జన


మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ పి.విజయ

కర్నూలు సిటీ: క్షేత్రస్థాయి పర్యటనలతో జ్ఞానసముపార్జన సాధ్యమని ఏపీ టూరిజం జిల్లా మేనేజర్ పి.విజయ తెలిపారు. బిక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో శనివారం ఏపీ టూరిజంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి పుస్తకాల్లో ఉన్న సమాచారానికి అదనపు సమాచారం తెలుసుకోవాలన్నారు. పుస్తకాల్లో ఉన్న అంశాన్ని నేరుగా వెళ్లి చూస్తే ఎక్కువ కాలం పాటు గుర్తు పెట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కాలేజీలో యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యలో అంతరాయం ఏర్పడినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న సూచించారు. శనివారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పనిచేసే ప్రాంతంలో అందుబాటులో ఉండాలని, అప్పుడే సమస్యలు తెలుస్తాయని చెప్పారు. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తే వినియోగదారులు సమస్యలు ఎదుర్కొంటారని, ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.

శిక్షణలో గ్రేడ్-3 ఈఓలు

కర్నూలు కల్చరల్: ఏపీపీఎస్సీ నుంచి దేవదాయశాఖ గ్రేడ్-3 ఈఓలు ఎంపికైన కార్యనిర్వహణాధికారులు ఐదుగురిని ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించారు. ఈఓలు అభిమన్యు, ఆంజనేయులు, జంబులమ్మ, సువర్ణ, బ్రహ్మానందరెడ్డి జిల్లాలో మూడు నెలలపాటు శిక్షణ పొందుతారని, అనంతరం వారికి స్థానాలు కేటాయిస్తారని సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు శనివారం తెలిపారు.

కొనసాగిన పాదయాత్ర

కర్నూలు(రూరల్): సీపీఎం పాదయాత్ర నగరంలో రెండో రోజు శనివారం కొనసాగింది. పంప్ హౌస్ నుంచి ఇందిరాగాంధీ నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా బాబా బృందావన్ నగర్ వరకు సాగింది. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, నగర జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని నగర కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ


గర్భిణికి పోషణ కిట్‌ను అందజేస్తున్న డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): వ్యాధినిరోధక టీకాలతో చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, మెనూ పరిశీలించారు. గర్భిణిలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మాతాశిశు సేవలపై అవగాహన కల్పించారు. వారికి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓలదే కీలక పాత్ర

- కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులదే (బీఎల్‌ఓ) కీలక పాత్ర అని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక సుంకేసుల రోడ్డులోని నగరపాలక నూతన కౌన్సిల్ భవనంలో బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితా రూపొందించడంలో కచ్చితత్వం పాటించాలన్నారు. ఓటర్ల వివరాలను బాధ్యతతో సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే అన్నారు. అనంతరం ఓటర్ల వివరాలకు సంబంధించిన మార్గదర్శకాలను బీఎల్‌ఓలకు కమిషనర్ అందించారు. సమావేశంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు మండల రెవెన్యూ అధికారి విజయశ్రీ, రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలం మంజూరైన వారందరూ గృహాలు నిర్మించుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ ఇందిరమ్మ కాలనీ లేఅవుట్ కాలనీలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులందరికి 20 టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తామని, సిమెంట్, ఉక్కు అతి తక్కువ ధరకు సరఫరా చేస్తామన్నారు. కాలనీలో ఇప్పటికే మౌలిక వసతులు కల్పించామని చెప్పారు.

సురక్షను సద్వినియోగం చేసుకోండి


మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): జగనన్న సురక్ష సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. శనివారం 20, 32, 33, 58, 59వ సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్షా కార్యక్రమంలో ఎమ్మెల్యే పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్లుగా నిరాటంకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే జగనన్న సురక్షా కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులై ఉండి పథకాలు అందలేదనే ఒక్కరూ కూడా బాధ పడకూడదన్నారు. పైసా ఖర్చు లేకుండా, పైరవీలు లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీల నాయకుల వెన్నులో వణుకు పుట్టిందన్నారు. అందుకే ఎల్లో మీడియాతో కలిసి వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. అన్నీ ప్రజలు గమనించాలని, ఎవరి హయాంలో మేలు జరిగిందే బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. శనివారం రాత్రి ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వడ్డెగేరి, బాపూజీ నగర్ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి యజమానులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. వారికి చేకూరిన పింఛన్, చేయూత, ఆసరా, వాహనమిత్ర, చేదోడు, అమ్మ ఒడి, ఇళ్ల స్థలం వంటి పథకాల లబ్ధి, వాటి విలువను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేకూర్చారని చెప్పారు. ఇందులో భాగంగానే నవరత్నాలు పథకాలు తెచ్చి అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు తెచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నారని, వీటిని లబ్ధి పొందిన ప్రజలు సొమ్మును సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ కో ఆప్షన్ మెంబర్ నయాం, నాయకులు నవీన్, ఎజాజ్ అలీఖాన్, హనీఫ్, షేక్షా, శ్రీను పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

జేసీ కోర్టు ఆర్‌ఓఆర్ కేసులపై విచారణ

కర్నూలు(సెంట్రల్): జాయింట్ కలెక్టర్ కోర్టులో మూడు ఆర్‌ఓఆర్ కేసులపై శనివారం విచారణ జరిగింది. కర్నూలు, హాలహర్వి, గోనెగండ్ల మండలాలకు సంబంధించిన కేసులపై జేసీ నారపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆయా కేసులకు సంబంధించి ఫిర్యాదుదారులు, కక్షిదారులు, వారి తరపు లాయర్లు హాజరై తమ తమ వాదనలను వినిపించారు.

ముగిసిన తొలి విడత శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జీవన నైపుణ్యాలపై నిర్వహించిన తొలి విడత శిక్షణ శనివారంతో ముగిసింది. ఎస్‌సీఈఆర్‌టీ ఆచార్యులు విజయ్ మాలిక్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిధర్ పాల్గొని ప్రసంగించారు. యుక్త వయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. లైఫ్ స్కిల్ ప్రాధాన్యత, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుందరా దేవి, ట్రైనర్స్ రమేష్, మనోహర్, బజారు, సుధాకర్ రెడ్డి, సురేంద్ర, బాపూజీ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

'నారాయణ'లో వనమహోత్సవం

కర్నూలు సిటీ: మాధవీనగర్‌లోని నారాయణ స్కూల్‌లో వన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణంపై చిన్నారులకు ప్రిన్సిపాల్ అల్తాఫ్ అవగహన కల్పించారు. విద్యార్థులు ప్రతి పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణంపై అవగహన ర్యాలీ నిర్వహించారు.

విలువిద్యలో రాణించాలి

కర్నూలు(రూరల్): విలువిద్యలో రాణించాలని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. శంకరాస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విలువిద్య క్రీడా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

చాతుర్మాస వ్రత మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో చాతుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. చాతుర్మాస పూజల్లో భాగంగా ధూప సేవ, నేతి దీపారాధన సేవ, రాజభోగ నివేదన, నేతి దీప హారతి, అష్టోత్తర శత నామార్చన సేవలు జరుగుతున్నాయని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు శనివారం తెలిపారు. నవంబర్ 27 వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలోని 34 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు కోరారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయలంలో కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి పీజీ నరసింహులు యాదవ్ తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. శనివారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిర శాంతి, ఈ–హబ్ సంస్థ సీఈఓ ఎస్.అనంతసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీకి ఆద్యుడు శుశ్రుతుడు


శుశ్రుతుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ సర్జరీకి ఆద్యుడు శుశ్రుతుడు అని స్థానిక మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ అన్నారు. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెడికల్ కాలేజీ ఆవరణలోని శుశ్రుతుడి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మాట్లాడుతూ శుశ్రుతుడు అన్ని రకాల సర్జరీలు నిర్వహించారన్నారు. ఆయన రాసిన పుస్తకం శుశ్రుత సంహిత ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. దీని ఆధారంగానే ప్లాస్టిక్ సర్జరీని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అప్పట్లోనే ఆయన సొంతంగా వైద్యపరికరాలు తయారు చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌లోనూ శుశ్రుత సంహితపై చర్చ జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కాలిన రోగుల వార్డు త్వరలో పూర్తవుతుందన్నారు. అనంతరం 70 శాతం కాలిన గాయాలకు ఎలా చికిత్స చేసి నయం చేయాలనే అంశంపై సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ భానుమూర్తి, జీజీహెచ్‌లో చేసిన పలు కేసుల గురించి ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మంజులబాయి పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ప్లాస్టిక్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక, డాక్టర్ భారతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని 17వ వార్డులోని ఎన్‌జీ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లడుతూ వార్డులో కరెంట్ పోల్స్, సీసీ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఇవ్వాలని, కాలనీలో కొత్త తాగునీటి ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం మేనేజర్ చిన్న రాముడికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, నాయకులు మహేష్, శివ, చంద్ర, మధు, పార్వతమ్మ, ఎన్‌జీ నగర్ కమిటీ సభ్యుడు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో పోస్టులను మంజూరు చేయండి

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ యూనివర్సిటీలో పలు పోస్టులను మంజూరు చేయాలని వీసీ ఆనందరావు ప్రతిపాదించారు. శనివారం అమరావతి నుంచి ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలారావు, కాలేజీ ఎడ్యుకేషనల్ సెక్రటరీ పోలా భాస్కర్ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పాలక మండలి సభ్యులతో, ల వీసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌యూ పాలక మండలి చైర్మన్, వీసీ ఆనందరావు మాట్లాడుతూ.. వర్సిటీకి 140 అధ్యాపక, 21 ప్రొఫెసర్, 38 అసోసియేట్ ప్రొఫెసర్, 81 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. వర్సిటీ 4వ కాన్వకేషన్ సెప్టెంబర్ 2023లో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. వర్సిటీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లు సుందరానంద పుచ్చ, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్‌ను కోర్టు ఉత్తర్వుల మేరకు విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

డీఏఓకు అభినందనలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉత్తమ పనితీరును కనబరిచి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టిన వ్యవసాయ అధికారి పీ.లలితా వరలక్ష్మిని కార్యాలయ ఉద్యోగులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి పద్మావతి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాశ్‌రావు, ఎంసీ కాశన్న, రాష్ట్ర టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నాపరాయి లారీలకు జరిమానా

కర్నూలు (న్యూసిటీ): అనుమతులు లేకుండా నాపరాయిని తీసుకెళ్తున్న వాహనాలకు జరిమానా విధించామని మైనింగ్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నాపరాయి తరలిస్తూ నాలుగు లారీలు బేతంచెర్ల వద్ద పట్టుబడ్డాయన్నారు. వాటిలో ఒక లారీ యజమానికి రూ.20 వేలు, మరో మూడు లారీల యజమానులకు రూ.25 వేల చొప్పున మొత్తం రూ.95 వేలు జరిమానా విధించామన్నారు.

మంత్రికి వినతి

కర్నూలు (న్యూసిటీ): యూనివర్సిటీ వీసీల పోస్టుల్లో గిరిజనులకు స్థానం కల్పించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప శనివారం విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొరను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి రమణ, రాష్ట్ర అధ్యక్షుడు మెడ శ్రీను, టీఎస్ఎఫ్ నాయకులు రవినాయక్, ఉదయ్ తదితరులు ఉన్నారు.